

వృద్ధాశ్రమంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి-రాయచోటి

పట్టణంలోని తిరుపతి నాయుడు కాలనీలో డాక్టర్ పి.మదన్మోహన్‌రెడ్డి వృద్ధుల కోసం స్థాపించిన లక్ష్మీ వృద్ధ ఆశ్రమంలో శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. జిల్లా జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు దివిటి పద్మ యాదవ్, మహిళా కార్యవర్గం కలిసి అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ఆశ్రమంలోని వృద్ధులకు బిపి, షుగర్ వంటివి పరీక్షించారు. సబ్బులు, బ్రెష్‌లు, పేస్ట్, పండ్లు పంపిణీ చేశారు. ప్రతి నెల ప్రతి వారంలోనే హెల్త్ చెకప్స్ చేస్తామని తెలిపారు.



వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న పద్మ

ఎంఎస్‌ఎంఇలపై బాదుడుకు కసరత్తు

పాలసీ రూపకల్పన పేరుతో సర్వే

నాలుగు నెలలుగా అరకొర

54 శాతం దాటని వైనం

మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ (ఎంఎస్‌ఎంఇ) సర్వే పేరుతో పన్ను బాదుడుకు రంగం సిద్ధమవుతోంది. ప్రభుత్వం నూతన పాలసీల రూపకల్పన పేరుతో సర్వే చేయాలని కోరుతూ ఆదేశాలు జారీ చేసింది. జిల్లా అధికార యంత్రాంగం నాలుగు నెలల కిందట నుంచి జిల్లాలోని సచివాలయాల వారీగా సర్వేకు శ్రీకారం చుట్టింది. జిల్లాలోని ఎంఎస్‌ఎంఇల సర్వే బృందాలకు పరిశ్రమల నిర్వాహకులు సర్కారు లోగుట్టును గ్రహించి సహకరించని పరిస్థితి నెలకొంది. ఫలితంగా ఈ నెల 15 నాటికి సర్వే గడువు దగ్గర పడుతున్న నేపథ్యంలో 54 శాతం సర్వేను సైతం పూర్తి చేయలేని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాలో 79,245 ఎంఎస్‌ఎంఇ పరిశ్రమలున్నాయి. మైక్రో, స్మాల్, మీడియం, లార్జ్ కేటగిరీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2,01,172 మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ప్రభుత్వం నూతన పాలసీ రూపకల్పన పేరుతో ఖజానా నింపుకోవడంపై దృష్టి సారించింది. ఎంఎస్‌ఎంఇల ఆర్థిక కార్యకలాపాల ఆధారంగా 18 శాతం నుంచి జిఎస్‌టి బాదుడుకు రంగం సిద్ధం చేసిందనే వాదనవినిపిస్తోంది. మైక్రో ఎంఎస్‌ఎంఇల ఆర్థిక లావాదేవీలు రూ.ఐదు కోట్లు, స్మాల్ ఎంఎస్‌ఎంఇ లావాదేవీలు రూ.ఐదు కోట్ల నుంచి 50 కోట్లు, మీడియం ఎంఎస్‌ఎంఇల లావాదేవీలు రూ.50 కోట్ల నుంచి రూ. 250 కోట్లు, అంతకు మించి ఆర్థిక లావాదేవీలు సాగించిన లార్జ్ ఎంఎస్‌ఎంఇలపై జిఎస్‌టి భారం పడే అవకాశాలు ఉన్నాయనే వాదన వినిపిస్తోంది.



సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది

సచివాలయాల వారీగా సర్వే

జిల్లాలోని 645 సచివాలయాల వారీగా సర్వే ఊపందుకుంది. ప్రతిరోజూ 3,304 ఎంఎస్‌ఎంఇలను సర్వే చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి పరిశీలిస్తే లక్ష్యానికి, ఆచరణకు పొంతన కుదరడం లేదు. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి 15 నాటికి జిల్లాలోని 79,245 ఎంఎస్‌ఎంఇల సర్వే ప్రక్రియను పూర్తి చేయాల్సి ఉంది. ప్రభుత్వ పాలసీల రూపకల్పన వెనుక గల అంతర్యాన్ని గమనించిన ఎంఎస్‌ఎంఇల యాజమాన్యాలు సహకరించని పరిస్థితి కనిపిస్తోంది.

జిఎస్‌టి గుప్పిట్లో...

జిల్లాలోని ఎంఎస్‌ఎంఇ నిర్వాహకులను జిఎస్‌టి భయం కలవరాన్ని కలిగిస్తోంది. ప్రభుత్వం నూతన పాలసీ రూపకల్పన పేరుతో చేపట్టిన సర్వేపై ఎంఎస్‌ఎంఇ నిర్వాహకుల్లో ఆందోళన నెలకొంది. సర్వే ఆశించిన విధంగా ముందుకు సాగడంలేదు. జిల్లాలోని కడప, ప్రొద్దుటూరు పట్టణాల్లో ఎంఎస్‌ఎంఇ పరిశ్రమలు ఎక్కువగా ఉన్నాయి. ప్రొద్దుటూరు పట్టణంలో గణనీయమైన సంఖ్యలో ఉన్నాయి. ఇక్కడి ఎంఎస్‌ఎంఇలపై సర్వే వేగ వడి లేదు. ఐదు కోట్లు దాటిన వ్యాపార కార్యకలాపాలన్నీ జిఎస్‌టి పరిధిలోకి వెళ్లే అవకాశం ఉంది. ఎంఎస్‌ఎంఇ నిర్వాహకులు ముందుకు రావడం లేదని తెలుస్తోంది.

నాలుగు నెలలు..54 శాతం!

జిల్లాలోని ఎంఎస్‌ఎంఇల సర్వే 54 శాతానికి పరిమితమైంది. 2024 నవంబర్ నుంచి 2025 మార్చి నాలుగవ తేదీ నాటికి నాలుగు నెలల వ్యవధిలో 43,117 ఎంఎస్‌ఎంఇల సర్వే మాత్రమే పూర్తి చేసింది. 2025 మార్చి 15 నాటికి సర్వే గడువు ముగియనుంది. మిగిలిన 10 రోజుల వ్యవధిలో మిగిలిన 36,173 ఎంఎస్‌ఎంఇల్లో ఎన్నింటి సర్వే పూర్తి చేయనుంది. ఎప్పటికి పూర్తి స్థాయిలో సర్వే ప్రక్రియ పూర్తవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

మహిళా సాధికారతే ప్రభుత్వ ధ్యేయమని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఓ ప్రయివేటు ఫంక్షన్ హాల్‌లో మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మహిళలకు ఇచ్చిన ప్రాధాన్యత వల్లే రాష్ట్రంలో మహిళా సాధికారత సాధ్యమైందని పేర్కొన్నారు. ఈ ఏడాది మే నుండి తల్లికివందనం చేపడుతున్నట్లుగా తెలిపారు. మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ రూ.4,800 కోట్లకు పైగా బడ్జెట్ కేటాయించారన్నారు. జిల్లాలో 25 వేల లావాదేవీలతో నాణ్యతతో కూడిన వస్తువులను విక్రయం చేసేందుకు సహకరించిన కలెక్టర్, జిల్లా యంత్రాంగానికి శుభాభినందనలు తెలిపారు. ప్రస్తుత ప్రపంచంలో మహిళల ద్వారా ఉత్పత్తి అవుతున్న వస్తువులకు డిమాండ్ ఉందంటే అది జిల్లా మహిళల ప్రత్యేకతన్నారు. కలెక్టర్ శ్రీధర్ చామకూరి మాట్లాడుతూ మదనపల్లెకు చెందిన భవాని స్ఫూర్తిగా తీసుకొని మహిళలందరూ ఆర్థిక, సామాజిక అభివృద్ధి పొందాలని సూచించారు. జిల్లా జిడిపిలో 23వ ర్యాంకులో ఉన్నప్పటికీ మహిళలు డిజిటల్ కామర్స్‌లో ఎంతో ముందు ఉన్నారని పేర్కొన్నారు. జిల్లాలోని మహిళలు చేసిన ఉత్పత్తులను విక్రయం చేసి రూ.25 లక్షల విలువతో 25 వేల లావాదేవీలు జరగడం ఇందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు. జిల్లాలో లక్షాధికారులుగా మారిన మహిళలను సత్కరించు కోవడం ఆనందదాయకమన్నారు. జిల్లాలో బాల్యవివాహాల నిర్మూలన కోసం ప్రభుత్వ యంత్రాంగం ఎంతో కృషి చేస్తోందన్నారు. ఎస్‌పి విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ మహిళలు కేవలం కుటుంబ పోషణలోనే కాకుండా దేశ ఆర్థిక అభివృద్ధికి ఎంతో పాటు పడుతున్నారని వారి భద్రత చాలా ముఖ్యమని పేర్కొన్నారు. మహిళల భద్రత కోసంశక్తి మొబైల్ యాప్‌ను ప్రారంభించినట్లు పేర్కొన్నారు ఈ యాప్ ఉపయోగించుకుని మహిళలకు ఎటువంటి అభద్రత ఎదురైన కేవలం ఒక బటన్ నొక్కితే పోలీసులకు సమాచారం వెళుతుందని పేర్కొన్నారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ ఆర్‌జెడి రోహిణి, ఎస్‌సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ దీప్తి, జిల్లా ఐసిడిఎస్ అధికారి రమాదేవి మాట్లాడుతూ 21వ శతాబ్దంలో మహిళలు అని రంగాలలో ఎంతో ప్రగతి సాధించారని, ఇంకా ఎంతో ప్రగతి సాధించాల్సి ఉందని పేర్కొన్నారు. కుటుంబంలో మహిళా సాధికారతకు తల్లి కీలక పాత్ర పోషించాలని సూచించారు. టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు వల్లే మహిళలకు 33 శాతం రిజర్వేషన్ సాధ్యమైందని, టిడిపి ప్రభుత్వం అన్ని రకాలుగా మహిళలకు చేయూతనిస్తోందని పేర్కొన్నారు. రాజంపేట పార్లమెంట్ జిల్లా అధ్యక్షులు జగన్ మోహన్‌రాజు, తంబళ్లపల్లి టిడిపి నాయకుడు జయచంద్రరెడ్డి, మదనపల్లెకు చెందిన భవాని ప్రసంగించారు. అనంతరం జిల్లాలో వివిధ శాఖలకు చెందిన ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు, లక్షాధికారులుగా మారిన మహిళలకు శాలువా, మెమోంటోలతో సత్కరించారు.



మహిళలకు చెక్‌లను అందజేస్తున్న మంత్రి, కలెక్టర్

రహదారుల నాణ్యతలో రాజీపడొద్దు

- రోడ్లు, భవనాల శాఖ మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి

ప్రజాశక్తి-రాయచోటి

గుంతల రహిత రోడ్ల మరమ్మతుల కార్యక్రమంలో భాగంగా అన్నమయ్య జిల్లాకు రూ.14 కోట్లు కేటాయించగా ఇప్పటివరకు 99 శాతం పనులు పూర్తి చేసినట్లు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి బి.సి.జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం రాయ చోటికి విచ్చేసిన మంత్రిని ఆర్‌అండ్‌బి శాఖ ఉన్నతా ధికారులు మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. ఈ సంద ర్భంగా అధికారులు జిల్లాలో ఇప్పటి వరకు పూర్తి చేసిన పనులకు బిల్లులన్నీ అప్లోడ్ అయినట్లు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మనల్ని నమ్మి కాంట్రాక్టర్లు ముందుకు వచ్చి పనులు చేయడమే గాక వేగంగా పనులు పూర్తి చేసిన నేపథ్యంలో సకాలంలో వారికి బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని మంత్రి హామీ ఇచ్చారు. నాణ్యతలో రాజీ పడకుండా పనులు జరిగేలా చూడాలని అధికారులకు ఆదేశించారు. జిఒ నెంబర్ 2 కింద పనులు ఏమైనా జరుగుతున్నాయా అని అధికారులను మంత్రి అడగ్గా, ఇంతవరకు పనులు కేటాయించలేదని అధికారులు తెలిపారు. వర్క్ ఇన్‌స్పెక్టర్ కొరత వేధిస్తుందని మంత్రి దృష్టికి అధికారులు తెలియజేశారు. రిక్రూట్మెంట్ జరగాల్సిన అవసరం ఉందని అధికారులు పేర్కొన్నారు. ఫీల్డ్ స్టాఫ్ లేనందువలన కొంతమేర పనులు ఆలస్యం అయ్యాయని తెలియజేశారు. సచివాలయ స్టాఫ్ ను ఉపయోగించుకుంటే బాగుంటుందని ఈ సందర్భంగా మంత్రి పేర్కొన్నారు. కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాయచోటి రింగురోడ్డు 4.5 కిలోమీటర్లు అసం పూర్తిగా ఉందని అందుకు గానూ రూ.8 కోట్లు నిధులు కేటాం50యిస్తే బైపాస్ నిర్మాణం పూర్తవు తుందని అధికారులు తెలియజేశారు. వెలిగల్లు ప్రాజెక్టు దగ్గర ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉందని అక్కడ ఆర్‌అండ్‌బి గెస్ట్ హౌస్ నిర్మిస్తే పర్యాటకంగా కూడా అభివృద్ధి జరుగుతుందని స్థానిక మంత్రి సోదరుడైన మండిపల్లి లక్ష్మీప్రసాద్‌రెడ్డి మంత్రి దృష్టికి తీసుకురాగా, అందుకు సహకరిస్తామని మంత్రి తెలియజేశారు.

నైపుణ్య కోర్సుల ఎంపికను ప్రోత్సహించాలి

- ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి అకడమిక్ ఆఫీసర్ మాథ్యూ శ్రీరంగం



శ్రీరంగంను సన్మానిస్తున్న రాటకొండ గురుప్రసాద్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

నైపుణ్య కోర్సులను ఎంపిక చేసుకునే విధంగా విద్యార్థులను ప్రోత్సహించాలని మండలి అకడమిక్ ఆఫీసర్ మాథ్యూ శ్రీరంగం అన్నారు. స్థానిక శ్రీ జ్ఞానాంబికా డిగ్రీ కళాశాలలో రెండవ రోజైన శనివారం నైపుణ్య కోర్సుల వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీరంగం మాట్లాడుతూ విద్యార్థులకు డిజిటల్ సాధనాలు ఉపయోగించి పాఠాలు బోధించాలని తెలియచేశారు. వీలైనంతవరకు విద్యార్థుల నుండి సమాధానాలను వెలికితీసే ప్రయత్నం చెయ్యాలి. వారి ప్రమేయాన్ని కూడా అందులో చొప్పించి వారి ద్వారానే సమాధానాలు రాబట్టేలా అలవాటు చేయడం చాలా ముఖ్యమని సూచించారు. బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించాలని తెలిపారు. స్వీయ వేగవంతమైన అంశాన్ని విధార్థులకు అలవాటు చేయడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని వివరించారు. విద్యార్థులకు పాఠ్యాంశాలు, సహ పాఠ్య కార్యకలాపాలు ముఖ్యమన్నారు. ప్రత్యేకంగా పరోశోదనలు, వృత్తి సంస్థలు ఇంటర్న్‌షిప్ మొదలైన నైపుణ్య కోర్సులకు ప్రాముఖ్యత ఇవ్వాలని కోరారు. నేర్పించిన అనంతరం సర్టిఫికెట్ ఇవ్వొచ్చని తెలిపారు. కార్యక్రమం అనంతరం శ్రీరంగం మాత్యూ ను కరెస్పాండెంట్ రాటకొండ గురుప్రసాద్ శాలువాతో సత్కరించారు. ఈ వర్క్‌షాప్‌లో కళాశాల కరెస్పాండెంట్ గురుప్రసాద్, ప్రిన్సిపల్, అధ్యాపకులు పాల్గొన్నారు.

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా పోస్టర్ విడుదల

ప్రజాశక్తి - కడప

వక్ఫ్ చట్ట సవరణకు వ్యతిరేకంగా ప్రజల్లో అవగాహన పెంచడానికి మైనారిటీ జిల్లా అధ్యక్షులు రహమతుల్లా ఖాన్ సిద్ధం చేసిన పోస్టర్లను శనివారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయ జ్యోతి విడుదల చేశారు. పోస్టర్ విడుదల సందర్భంగా వక్ఫ్ చట్ట సవరణ వల్ల మైనారిటీ హక్కులు హరించబడుతున్నాయని, దీని వెనుక ఉన్న గోప్య లక్ష్యాలను ప్రజలు గుర్తించి నిరసన వ్యక్తం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సిటీ అధ్యక్షులు అఫ్జల్ ఖాన్, పిసిసి ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీఖాన్, మైనార్టీ క్రిస్టియన్ జిల్లా అధ్యక్షులు పీడీ సంజయ్‌కాంత, తులసి, సుబ్బమ్మ, సంతోషమ్మ, మామిళ్ళ బాబు, అబ్దుల్ సత్తార్, మల్లెం విజయభాస్కర్, కదిరి ప్రసాద్ గౌడ్, రఫీఖ్ ఖాన్, సయ్యద్ గౌస్ పీర్, సిరాజుద్దీన్, ముబారక్, చిన్న కుల్లాయప్ప, ఆసిఫ్ ఖాన్, కమల్ భాష, హమీద్ ఖాన్, రాహంతుల్లా ఖాన్, శీలం గంగయ్య, జహూర్ పాల్గొన్నారు.

మృత్యుఘోష

ప్రజా'దృష్టి'

జిల్లాలో రోడ్డు ప్రమాదాల పరంపరం కొనసాగుతోంది. గత బుధవారం గువ్వల చెరువుఘాట్, దువ్వూరు, కొండాపురం మండలాల్లో చోటుచేసుకున్న వేర్వేరు రోడ్డుప్రమాదాల్లో ఐదుగురు మృత్యు వాతపడడం ఆందోళన కలిగిస్తోంది. గువ్వలచెరువు ఘాట్ మృత్యువుకు కేరాఫ్ అడ్రెస్‌గా మారింది. ప్రతి ఏటా రోడ్డు భద్రతా వారోత్సవాల్లో రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏకరువు పెట్టడం మినహా ఆచరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తల పట్ల మిన్నకుండిపోవడం, ఫలితంగా మరుసటి రోజు నుంచే ఒక్కడో ఒకచోట ప్రమాదాలు చోటుచేసుకోవడం పరిపాటిగా మారింది. కడప, అన్నమయ్య జిల్లాల సరిహద్దు ప్రాంతమైన గువ్వలచెరువు ఘాట్ మీదుగా లాజిస్టిక్స్ వాహనాలను రాత్రిపూట వెళ్లడానికి డ్రైవర్లకు మత్తు పరీక్షల నిర్వహణ సహా డ్రైవర్ ఎన్ని కిలోమీటర్ల నుంచి డ్రైవింగ్ చేస్తున్నాడనే అంశాలను పరిశీలించడం, సంబంధిత నిపు ణులు సలహాలు తీసుకుని అమలును పరిశీలిస్తే ప్రమాదాల నివారణకు అవకాశం ఉంటుందేమో ఆలోచించాలి. కడప జిల్లాలోని గువ్వలచెరువు, పులివెందుల, కదిరి, అన్నమయ్య జిల్లా రాపూర్ తదితర ఘాట్లలోని ఆయా మలుపుల దగ్గర పడిపోయిన రక్షణ గోడల పునరుద్ధరణ, బలమైన సిమెంట్ కాంక్రీట్ గోడలను నిర్మించాల్సిన ఆవశ్యకతను గ్రహించాల్సి ఉంది. లాజిస్టిక్ వాహనాలు సుదూర ప్రాంతాల నుంచి ప్రయాణిస్తున్న నేపథ్యంలో బైక్‌లపై వెళ్లాలంటే మృత్యువుకు సిద్ధపడి ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. పోలీసులు, రోడ్డు ట్రాన్స్‌పోర్టు కమిషనర్స్, ఇతర సంబంధిత అధికారులు కలిసికట్టుగా కృషి చేయడం ద్వారా రోడ్డు ప్రమాదాలను నివారించడానికి అవకాశం ఉంటుంది. ఫలితంగా అమూల్యమైన మనుషుల, మూగజీవుల ప్రాణాలను కాపాడిన వారవుతారనడంలో సందేహం లేదు. రక్షణ చర్యల ద్వారా రోడ్డుప్రమాదాల బారిన పడిన బాధిత కుటుంబాలను రోడ్డున పడకుండా కాపాడిన వారవుతారు. ప్రమాదాలను నివారించడం ద్వారా సామాజిక అంశాంతిని, దేశ ఆర్థిక వ్యవస్థపై పడుతున్న భారాల్ని సైతం తగ్గించిన వారవుతారనడంలో సందేహం లేదు. రహదారుల్లో ప్రమాదకర ప్రాంతాల్లో స్పీడ్‌బ్రేకర్లు వేయడం, హెచ్చరికల మార్కులను ఏర్పాటు చేయడం, రహదారులపై ఏర్పాటు చేసిన మెర్క్యూరీ లైట్ల నిర్వహణ మానిటరింగ్ చేయడం, లాజిస్టిక్స్ వాహనాలకు ఇద్దరు డ్రైవర్లు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవడం, వారి పనితీరును పరిశీలించడం, అధికారులు తనిఖీలను పెంచడం, రాష్ట్ర, జాతీయ రహదారుల సమీప ప్రాంతాల్లో మద్యం దుకాణాలను ఏర్పాటు చేయకపోవడం, రోడ్డు ప్రమాదాల నివారణలో ముందంజలో ఉన్న రాష్ట్రాల నమూనాలను పరిశీలన, రాష్ట్రంలో అమలు చేయడం తదితర రక్షణ చర్యలను తీసుకోవాల్సిన అవసరం ఉంది. లేనిపక్షంలో అధికారులు, ధనిక, పేదలు అనే తేడా లేకుండా పలువురు రోడ్డు ప్రమాదాల రూపంలో కడతేరిపోయే అవకాశాలు ఉన్నాయనే సంగతిని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి



విద్యార్థికి మెమోంటో అందజేస్తున్న ఎఎస్‌పి వెంకటాద్రి

ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : ఎఎస్‌పి

ప్రజాశక్తి-మదనపల్లె

విద్యార్థులు దిశానిర్దేశం చేసుకొని విద్యనభ్యసిస్తే ఉన్నత శిఖరాలు చేరుకోవడం సులభమని ఎఎస్‌పి వెంకటాద్రి అన్నారు. శనివారం స్థానిక ఆదిత్య కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్ కాలేజ్ (ఎసిఇ ఫీఎస్టా 2కె25) కాలేజ్ వార్షికోత్సవంను జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి మాట్లాడుతూ టెక్నాలజీలను అందిపుచ్చు కోవాలన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు కన్న కలలను నెరవేర్చాలని అప్పుడే వారికి ఎంతో సంతోషాన్ని ఇచ్చినవారు ఔతారన్నారు.అనంతరం కాలేజ్ టాపర్లుగా నిలిచినవారికి, వివిధ రంగాల పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు మెమోం టోలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాలకరస్పాండెంట్ ఆర్.రామమోహన్ రెడ్డి, ప్రెసిడెంట్ ఎం.నాగమల్లారెడ్డి, డైరెక్టర్ డాక్టర్ ఎస్.రామలింగారెడ్డి, రూరల్ సిఐ.కె. వెంకటరమణ ప్రిన్సిపల్ డాక్టర్ సతీష్ బాబు సిబ్బంది విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఆరోగ్య పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-పీలేరు

మహిళల ఆరోగ్య రక్షణకున్న ఆరోగ్యపథకాలు, జాతీయ ఆరోగ్య సేవలను ప్రజలకు పరిచయం చేసి వాటి కార్యరూపానికి బాధ్యత వహించడమే నిజమైన మానవసేవని డాక్టర్ రమేష్ రెడ్డి తెలిపారు. శనివారం తలుపుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన వైద్యాధికారి డాక్టర్ రమేష్‌రెడ్డి అధ్యక్షతన వివిధ స్థాయిలో విధులు నిర్వహిస్తున్న ఆరుగురు సిబ్బందికి దుశ్శాలువ, పూలమాలలతో సత్కరించి గౌరవించారు. సత్కారం అందుకున్న వారిలో ఆరోగ్య పర్యవేక్షకులు కుసుమ కుమారి, ఎఎన్‌ఎం భార్గవి, ప్రమీల, ఫార్మాసిస్టు ప్రభావతి, సిహెచ్ఒ కుమ్ముదా, ఆశ కార్యకర్త రెడ్డమ్మ ఉన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ కొండయ్య, పర్యవేక్షకులు కృష్ణయ్య, కుమార్, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు, సిహెచ్వోలు, స్టాఫ్ నర్స్ పాల్గొన్నారు.

పిహెచ్‌సిలో మొక్కలు నాటిన వైద్యులు

ప్రజాశక్తి-పీలేరు: పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రాంగణంలో వైద్యులు, వైద్య సిబ్బంది మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. బిస్మిల్లా ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బోధిషావలి ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకుని మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ మహిళా దినోత్సవం గుర్తుండిపోయేలా బిస్మిల్లా ఆటో యూనియన్ నాయకులు, సభ్యులు ఆసుపత్రి ప్రాంగణంలో మొక్కలు నాటడం సంతోషించేదగ్గ విషయమని అన్నారు. ఇదే స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ ఇంటికి ఒక మొక్క వంతున నాటి పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ నాగవేణి, డాక్టర్ ఇందుమతి, షాహ్, వైద్య సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న వైద్యులు



మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీనివాసరావు

సౌకర్యంగా రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

- జిల్లా అదనపు న్యాయమూర్తి ఎన్.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-పీలేరు: పట్టణంలో చేపట్టిన ఆర్ఒబి నిర్మాణం పనుల వల్ల వాహనదారులకు, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిర్మాణం చేయాలని 9వ అదనపు జిల్లా న్యాయమూర్తి డాక్టర్ ఎన్.శ్రీనివాసరావు సంబంధిత అధికారులకు సూచించారు. పీలేరు 11వ అదనపు జిల్లా జడ్జి న్యాయస్థానంలో శనివారం జరిగిన లోక్అదాలత్‌లో న్యాయమూర్తి అధికారులతో మాట్లాడుతూ పట్టణంలోని చిత్తూరు రోడ్డు, మదనపల్లి మార్గంలోని రైల్వే గేట్ల వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం పనులు రెండేళ్లుగా జరుగుతున్నాయని, రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న ఇళ్లకు గుర్తులు పెట్టి నిర్మాణాలను కూడా తొలగించారని, అయినా ఇంకా పనులు పూర్తి కాని ఫలితంగా రోడ్లకు ఇరువైపులా ఉన్న ఇళ్ల యజమానులు తమ దెబ్బతిన్న ఇళ్లకు మరమ్మతులు చేసుకోలేక పోతున్నారని పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో 87 కేసులు పరిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ శివశంకర్, డిప్యూటీ తహశీల్దారు చంద్రశేఖర్ పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్ :** జాతీయ లోక్ అదాలత్‌లో పలుకే సులు రాజీ అయినట్లు రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి, మండల్ లీగల్ సర్వీస్ చైర్మన్ అబ్రహం తెలిపారు. కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ లోక్ అదాలత్‌లో 2023 జూలైలో జరిగిన ఒక రోడ్డు ప్రమాదం సంబంధించిన కేసులో బాధితులకు ద న్యూ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ రూ.97 లక్షలు చెల్లించారు. కర్నూలు జిల్లా పగిడిరాయికి చెందిన అనిల్ కుమార్, అర్చకులుగా పనిచేస్తున్న రాఘవేంద్ర 2023 జూలై 28న ద్విచక్ర వాహనంలో వెళు తుండగా అనంతపురం జిల్లా ఆత్మకూరు వద్ద రోడ్డు ప్రమాదం మృతి చెందారు. ఈ కేసులో అనిల్ కుమార్ కుటుంబానికి రూ.42 లక్షలు, రాఘవేంద్ర కుటుంబానికి రూ.55 లక్షలు ఇన్సూరెన్స్ కంపెనీ సిద్ధపడటంతో కేసు రాజీ చేసుకున్నారు కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీనియర్ జడ్జ్ వెంకటేష్ నాయక్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఇన్‌ఛార్జి న్యాయమూర్తి శిరీష్ అధ్యక్షతన మెగాలోక్ అదాలత్ నిర్వహించారు. కార్యక్రమంలో బార్ అసోసి యేషన్ అధ్యక్షులు జనార్ధన్‌రెడ్డి, లోక్ అదాలత్ కార్యక్రమం గురించి వివరించారు. కేసులకు సంబంధించి రూ.12.57 లక్షలు బాధితులకు ఇచ్చారు.

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటూ వాల్మీకి బోయ సంఘాలు 56 ఏళ్లుగా వివిధ రకాలుగా పోరాటాలు సాగిస్తున్నారని వాల్మీకి రిజర్వేషన్ సాధన సమితి అధ్యక్షులు పొదల నరసింహులు అన్నారు. శనివారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో మాత్రం వాల్మీకులను మభ్యపెడుతూ గద్దెనెక్కిన తర్వాత ఇచ్చిన హామీని పక్కన పెడుతున్నారని విమర్శించారు. ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీ ఓట్లకు వచ్చిన సమయంలో మీ విషయాన్ని పార్లమెంట్, అసెంబ్లీలో మాట్లాడి న్యాయం చేస్తామని హామీలు గుప్పించి, అనక గద్దనెక్కినాక విస్మరించడం పరిపాటిగా మారిందన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో పుట్టపర్తి ఎమ్మెల్యే సింధూరరెడ్డి వాల్మీకి సమస్యలపై గళమెత్తడం, వాల్మీకులను ఎస్‌టిలో చేర్చాలని మాట్లాడడం హర్షనీయమన్నారు . ఆమెను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఎమ్మెల్యే, ప్రతి ఎంపీ అసెంబ్లీ, పార్లమెంట్ సమావేశాల్లో వాల్మీకుల సమస్యలపై గళమెత్తి మా 56 ఏళ్ల పోరాటాన్ని ప్రస్తావించి వాల్మీకి బోయలకు న్యాయం చేస్తూ ఎస్‌టి జాబితాలో చేర్చేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. లేనిపక్షంలో తగిన గుణపాఠం చెబుతామన్నారు. గత వైసిపి ప్రభుత్వం కూడా వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేరుస్తామని ప్రతిపాదించి గద్దెనెక్కి, ఐదేళ్ల విస్మరించడంతో తగిన గుణపాఠం చెప్పామన్నారు. కూటమి ప్రభుత్వం కూడా తమను విస్మరిస్తే రాబోయే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పి ఇంటికి సాగనంపుతామని హెచ్చరించారు. ఇప్పటికైనా రాజకీయ నాయకులు వాల్మీకులకు ఎస్‌టి జాబితాను పునరుద్ధరించే విషయమై న్యాయం చేయాలని కోరారు. లేనిపక్షంలో ఉద్యమ కార్యాచరణ రూపొందించి ప్రజాక్షేత్రంలోకి వస్తామని, ఉద్యమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో వాల్మీకి బోయలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



వాల్మీకులను ఎస్‌టి జాబితాలో చేర్చాలంటున్న విఆర్‌ఎస్‌ఎస్ నాయకులు



టోర్నమెంటును ప్రారంభిస్తున్న టిడిపి నాయకులు

క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలి

ప్రజాశక్తి-నందలూరు

క్రీడాకారులు క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండాలని టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపూరి వేణుగోపాల్, టిడిపి మండల క్లస్టర్ ఇంచార్జ్ పసుపులేటి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఆడపూర్ లో వెలిసిన శ్రీ మంచాలమ్మ జాతర సందర్భంగా రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు చమర్తి జగన్మోహన్ రాజు సహకారంతో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంటును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలను ప్రోత్సహించడంలో జగన్మోహన్‌రాజు ముందుంటారని అన్నారు. క్రీడలు మానసిక ఉల్లాసాన్ని పెంచుతాయని, గెలుపోటములు సమానంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాగిరెడ్డిపల్లి, పాటూరు గ్రామ టిడిపి అధ్యక్షులు గంధం గంగాధర్, ముమ్మడిశెట్టి రమేష్ క్రికెట్ టోర్నమెంట్ కార్య నిర్వాహకులు రాజా, రిషి, భానుప్రకాష్ పాల్గొన్నారు.



వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన కలిపిస్తున్నమహమ్మద్ రఫీ

వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-కలికిరి

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఆదేశాల మేరకు వడదెబ్బ పై విద్యార్థులకు స్థానిక ఇంటిగ్రేటెడ్ హాస్టల్ విద్యార్థులకు హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్‌రఫీ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి కాలం ప్రారంభం కావడంతో ఎండలు క్రమేపి పెరుగుతున్న దరిమిలా విద్యార్థులకు ఒంటిపూట బడులు ప్రభుత్వం వారు ప్రవేశపెడుతున్నారని అన్నారు. మధ్యాహ్న సమయంలో విద్యార్థులు బయటకు వెళ్లకుండా హాస్టల్ లోపలే ఉండి హోమ్‌వర్క్ చేసుకోవడం, చదువు కోవడం లేదా నిద్ర పోవడం చేయాలన్నారు. ఎండలో క్రికెట్, కబాడీ, ఖోఖో, వాలీబాల్ వంటి ఆటలు ఆడటం వల్ల వడ దెబ్బ కు గురి అయ్యే ప్రమాదం ఉందని తెలిపారు. ఎక్కువగా జ్వరం, తలనొప్పి, నీరసం, కళ్ళు తిరుగుట, విరోచనాలు, వాంతులు, నోరు ఆరిపోవుట, అపస్మారక స్థితి లోకి వెళ్లడం, కలవరింతలు వంటి లక్షణాలు ఉంటాయని, అన్నారు. వడదెబ్బకు గురైన వ్యక్తి ని వెంటనే చల్లటి, నీడ ప్రదేశం లోకి తీసు కెళ్లాలని, మెలకువలో ఉంటే ఉప్పు కలిపిన మజ్జిగ లేదా ఒఆర్ఎస్ ద్రావణం తాగించాలని తెలిపారు. మొహంను చల్లటి నీటితో కడగాలని, బట్టలు వదులు చేసి గాలి బాగా వచ్చే విధంగా ఫ్యాన్ కింద ఉంచాలని, వీలైతే మాట్లాడిస్తూ ఉండాలన్నారు. గర్భిణులు, బాలింతలు, 10సంవత్సరాల లోపు పిల్లలు, అరవై సంవత్సరాల పైబడిన వారు చాలా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. కార్యక్రమం లో హాస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.

రూ.163 కోట్ల పథకంలో రూ.700 కోట్ల అవినీతి సాధ్యమా? : 'రాచమల్లు'

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు నియోజకవర్గంలో రూ.163కోట్లతో ప్రారంభించిన జగనన్న ఇళ్ల పథకంలో రూ.700కోట్ల అవినీతి సాధ్యమా అని వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు ప్రసాద్‌రెడ్డి ప్రశ్నించారు. రెండు రోజుల క్రితం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులు రెడ్డి జగనన్న ఇళ్ల కాలనీలో తాను రూ.700 కోట్ల అవినీతికి పాల్పడ్డామని చేసిన ఆరోపణలపై రాచమల్లు శనివారం స్పందించారు. తన ఇంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రొద్దుటూరులో పేదల ఇళ్ల నిర్మాణానికి జగన్ హయాంలో 476 ఎకరాల 6సెంట్ల భూమిని రైతుల వద్ద నుండి కొన్నామన్నారు. ఇందుకు రూ.163కోట్లు వెచ్చించామన్నారు. మూడు చోట్ల కొన్న భూమిని పైసలతో సహా వివరించారు. ఇందులో తాను రూ.700 కోట్లు కొట్టేసానని వరద ఆరోపించారన్నారు. ఇది ఆయన అజ్ఞానానికి నిదర్శనం అన్నారు. ఈ వ్యవహారంలో కూటమి ప్రభుత్వం విజిలెన్స్‌తో విచా రణ చేయించినప్పటికీ తాను అవినీతికి పాల్పడి నట్లుగా నిరూపితం కాలేద న్నారు. తన నిజాయితీని వరద జీర్ణించుకోలేక ఉన్నాడని తన అహాన్ని చల్ల బరుచుకోవడానికి అసెంబ్లీ వేదికగా అబద్ధాలు మాట్లాడుతున్నారన్నారు. తనపై ఎన్నిసార్లయినా విచారణ చేసు కోవ చ్చన్నారు. ప్రజలు అర్థం చేసుకోవాలన్నారు. తాను అప్పుల్లో ఉండడమే జగన్ స్వచ్ఛమైన పాలనకు నిదర్శనమన్నారు. ధర్మంగా ఉండడం ఇతరులకు సహాయపడడం తన బలమని రాచమల్లు పేర్కొ న్నారు. సమా వేశంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.

వనిపెంట నుంచి నేషనల్ హైవే ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - చాపాడు(మైదుకూరు)

మైదుకూరు మండలం వనిపెంట గ్రామం మీదుగా అభివృద్ధి దిశగా వెళుతున్న నేషనల్ హైవేను వనిపెంట గ్రామంలోనే ఏర్పాటు చేయాలని రైతు సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ఎవి రమణ డిమాండ్ చేశారు. ఆ మేరకు శనివారం ఆయన ప్రజలతో కలిసి మాట్లాడుతూ గ్రామ సమీపాన శ్మశానాల మీదుగా, గోడేరు వంకపై ప్రమాదకర బైపాస్ రహదారిగా కాకుండా వనిపెంట గ్రామంలో నుంచే తీసుకెళ్లాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను, నేషనల్ హైవే అధికారులను కోరారు. మైదుకూరు నుండి పోరుమామిళ్ల వరకు అన్ని గ్రామాల్లోనే రోడ్డు పనులు జరుగుతున్నాయని తెలిపారు. వనిపెంట గ్రామంలో రోడ్డుకు సరిపడా 90 శాతం స్థలం ప్రభుత్వానిది ఉన్నా, బైపాస్ నిర్మాణం చేపడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి దశలవారీ నిరసన కార్యక్రమాల్లో భాగంగా తొలి విడతగా గ్రామ బయట రహదారి నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ రాతపూర్వక వినతి తో గ్రామ రైతులు, ప్రజలతో సంతకాల సేకరణ సేకరించారు. కార్యక్రమంలో రైతు సేవాసమితి మైదు కూరు నియోజకవర్గ కార్యదర్శి మాడిశెట్టి సహదేవుడు, జిల్లా సమితి సభ్యులు మూలే రామాంజనేయరెడ్డి, గ్రామ రైతులు, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కటారు వీరన్న, భూమిరెడ్డి శ్రీనివాసులు పాల్గొన్నారు.

జాతీయ రహదారి విస్తరణ పనులు

ప్రజాశక్తి - ముద్దనూరు : జాతీయ రహదారి విస్తరణలో భాగంగా శనివారం నాలుగు రోడ్ల కూడలి నుంచి రోడ్డు ఆక్రమణకు గురైన కట్టడాలను అధికారులు జెసిబితో తొలగింపు చర్యలు చేపట్టారు. అంతకుముందు రోడ్డుకు ఇరువైపులా అడ్డుగా ఉన్న భారీ చెట్లను తొలగించారు. జమ్మలమడుగు రహదారిలోని శివాలయం కూడలి నుంచి పులివెందుల రహదారిలోని బిఎస్ఎన్ఎల్ టెలిఫోన్ ఎక్స్ఛేంజ్ కార్యాలయం సమీపంలో ఉన్న వంక వరకు 2.7కిలో మీటర్లు రూ.8కోట్లతో రోడ్డు పనులు చేయనున్నట్లు జాతీయ రహదారి ఎఇ విశ్వనాథ్ తెలిపారు. ముద్ద నూరు అభివృద్ధికి బాటలు పడుతున్నాయన్నారు.

లక్ష్మీపేట పరీక్ష కేంద్రం తొలగింపు

ప్రజాశక్తి - చాపాడు : మండల పరిధిలోని లక్ష్మీపేట ఉన్నత పాఠశాల గతంలో పదవ తరగతి పరీక్షా కేంద్రంగా ఉండేది. ఈ ఏడాది పాఠశాలను తొలగించి దాని స్థానంలో చాపాడులోని కస్తూరిబా బాలికల పాఠశాలను ఏర్పాటు చేశారు. గతంలో లక్ష్మీపేటలో ఒకటి, చాపాడు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో రెండు పరీక్ష కేంద్రాలు నిర్వహించేవారు. ఈ ఏడాది కస్తూర్బా బాలికల పాఠశాలను, గూడూరు అప్పయ్యగారి జడ్పి ఉన్నత పాఠశాలను పరీక్షా కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు ఎంఈఓ రవిశంకర్ తెలిపారు. కస్తూర్బా బాలికల పాఠశాలలో 115 మంది, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 247 మంది విద్యార్థులు 10వ తరగతి పరీక్షలు రాసేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఈనెల 17 నుంచి 10వ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు.

ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు



రాజంపేట : పురస్కారాలు అందుకున్న సిడిపిఒ, సూపర్‌వైజర్, అంగన్వాడీలు



కలకడ : కానిస్టేబుల్ శోభారాణి సన్మానిస్తున్న ఎస్ఐ, సిబ్బంది

ప్రజాశక్తి-రాజంపేట

మహిళలు అన్ని రంగాలలో రాణించాలని రాజంపేట జిల్లా మూడవ అదనపు న్యాయమూర్తి ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా న్యాయమూర్తి ప్రవీణకుమార్ ఆధ్వర్యంలో ఈ వేడు కలు ఘనంగా జరిగాయి. దేశ చరిత్రలో మహిళల గొప్పతనము గురించి వివరించారు. ఈ సమావేశంలో సీనియర్ సివిల్ జడ్జి కేశవ, జూనియర్ సివిల్ జడ్జి భార్గవి, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ శంకర్, ఎపిపి రసూల్ రెహానా, ఎజిపి మౌనిక, మహిళా న్యాయవాదులు సులోచన, సాయిప్రశాంతి, సరిత, ఆశా ప్రియా, బార్ ప్రెసిడెంట్ నాసరుద్దీన్, మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, సీనియర్ న్యాయవాదులు కృష్ణకుమార్, హనుమంతునాయుడు, ఎస్‌బిఐ మేనేజర్ పుష్పలత మాట్లాడారు. ప్రసంగించారు.మహిళా న్యాయవాదులు, మహిళా న్యాయస్థాన సిబ్బందిని శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయస్తాన సిబ్బంది చెంద్రాయుడు, ప్రసాద్, రమణ, చంద్రమౌళి, విజయ్ పాల్గొన్నారు.

అంగన్వాడీలకు అత్యున్నత పురస్కారాలు

అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని రాయచోటిలో కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆధ్వర్యములో శిశు అభివృద్ధి పథక కార్యాలయం రాజంపేట ప్రాజెక్టు లో పనిచేస్తున్న సిడిపిఒ వై.సుజామణి, సెక్టార్ సూపర్‌వైజర్ జె.శంకరమ్మ, పి.సునీతమ్మ, రాజంపేట మున్సిపాలిటీలోని అంగన్వాడీ కార్యకర్తలు పి.వి.శివరంజని, జి.లక్ష్మీప్ర సన్నలకు రాజంపేట ఐసిడిఎస్ పాజెక్టు పరిదిలో ఉత్తమ ప్రతిభ చూపించనందుకు గాను కలెక్టర్ ఘనంగా సన్మానించి ఉత్తమ మహిళా పురస్కారా లు ప్రదానం చేశారు. **పుల్లంపేట :** మండల పరిధిలోని కేతరాజుపల్లి గ్రామ అంగన్వాడీ కార్యకర్త సరోజనమ్మను రైల్వేకోడూరు ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ ఎసిడిపిఒ అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా ఘనంగా సత్కరించారు. **మదనపల్లె అర్బన్ :** బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆధ్వర్యంలో మదనపల్లె పట్టణం ఎస్టేట్ లోని రైజ్డ్ ఆన్ డెనిమ్ ఇండియా ఫ్యాక్టరీలోఅంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డాక్టర్ రాధిక, ఎస్క్మి శివగామిని, లాయర్ రమాదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూప్రపంచ మనుగడ సాగించడంలో మహిళలు ముఖ్యపాత్ర పోషించారన్నారు. అంతరిక్షంలో సైతం పరిశోధనలు చేయడంలో మహిళలే ప్రధాన పాత్ర వహిస్తున్నారని అందుకు ఉదాహరణే సునిత విలియమ్స్ అని గుర్తు చేశారు. మానసి కంగా ఒత్తిడికి గురవుతున్న ప్రతి మహిళకి మానసిక ప్రశాంతత అవసరమని డాక్టర్ రాధిక విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో డెనిమ్ ఇండియా కంపెనీ జిఎం సోలోమెన్ మురారి, హెచ్ఆర్ మేనేజర్ స్వర్ణ, బహుజనసేన మహిళ నాయకురాలు మేరీ, కళాకారులు లక్ష్మీ, ఉషారాణి, బాహు జన సేన నాయకులు గిన్నెల మనోహర్ రెడ్డి, మూడే రూపక్‌నాయక్, శివశంకర్‌లారా సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. **పుల్లంపేట :** మహిళలు అన్ని రంగాలలో ముందుండాలని రాజంపేట సిఐ బివి.రమణ పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా పుల్లంపేట ఎస్‌బివిడి జూనియర్ కాలేజీలో మహిళలకు సంబంధించిన చట్టాల గురించి, సమాజంలో వారి పాత్ర గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలకు ముఖ్యంగా చదువు వజ్రాయుధమని వారి జీవితానికి రక్షణ భద్రత కల్పిస్తుందని అన్నారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, మహిళా పోలీసులు, మహిళలు పాల్గొన్నారు. **బి.కొత్తకోట :** పట్టణంలోని స్థానిక రంగసముద్రం రోడ్డులో గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సంద్భంగా కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్ మాట్లాడుతూ అన్ని రంగాలలో మహిళలకు ఎప్పుడైతే ప్రాధాన్యత ఉంటుందో అప్పుడే దేశం అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. మహిళా సాధికారత కల్పించడం అనేది మహిళలను సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల, లింగ ఆధారిత వివక్షల నుంచి విముక్తులను చేయడమేనని అన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ప్రసాద్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ బి.రాజేంద్రనాయక్ అధ్యాపకులు పాల్గొన్నారు. **రాయచోటి టౌన్ :** మహిళలు అన్ని రంగాల్లో రాణించి విద్యావంతులు కావాలని లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి జోన్ చైర్మన్ లయన్ షేక్ మొహమ్మద్, అధ్యక్షులు లయన్ పి శివారెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని బెతల్ కాలనీలో ఉండే శివతేజ హైస్కూల్లో పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో టౌన్ ప్రెసిడెంట్ ఎం సుధాకర్ రెడ్డి, పాఠశాల కరస్పాండెంట్ నాగేశ్వరరావు, లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ జిల్లా చైర్మన్ లయన్ వి.హరీష్ చంద్ర, కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహ్మద్, పాఠశాల డైరెక్టర్ శివ శంకర్ పాల్గొన్నారు. **కలకడ:** మహిళా పోలీసును ఎస్ఐ రామాంజనేయులు సిబ్బంది ఘనంగా సన్మానించారు. మండల కేంద్రమైన కలకడ పోలీసు స్టేషన్‌లో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్న శోభారాణిని ప్రపంచ మహి ళా దినోత్సవం సందర్భంగా పూలమాలవేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ హరిబాబు, పోలీస్‌సిబ్బంది తాతయ్య, రియాజ్ భాషా, కరుణాకర, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. **నందలూరు:** విద్యార్థులు ఉన్నత ఆశయాలతో ముందుకెళ్లాలని రిమ్స్ డాక్టర్ సృజన, గైనకాలజిస్ట్ కామేశ్వరమ్మ పేర్కొన్నారు. గొబ్బిళ్ళ అక్షర స్కూల్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహిం చారు. జాతీయస్థాయిలో గోల్డ్ మెడల్ సాధించిన లక్ష్మీ చైతన్య, షేక్ జైనబ్ లను అభినందించారు. స్కూల్ యాజమాన్యం గొబ్బిళ్ళ త్రినాథ్, గొబ్బిళ్ళ శ్రీనాథ్, ఉపాధ్యాయులు డాక్టర్ కామేశ్వరమ్మ, డాక్టర్ సృజన లను శాలువాతో సత్కరించారు.



రాయచోటి : మహిళా ఉపాధ్యాయులను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు



బి.కొత్తకోట : విద్యార్థినికి మెమోంటో అందిస్తున్న ప్రిన్సిపల్

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే ధ్యేయం : 'నల్లారి'

ప్రజాశక్తి-కలికిరి

బడుగు బలహీన వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిషోర్ కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం నగిరిపల్లిలో పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, గుర్రం కొండ, కలకడ మండలాలకు చెందిన బాధితులకు సిఎం సహాయనిధి కింద రూ. 31.24 లక్షల చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిఎం చంద్రబాబు నేతృత్వంలో బడుగు బలహీన వర్గాలకు పూర్తి భరోసా కల్పిస్తూ, ప్రాణాపాయ స్థితిలో ఉన్న నిరుపేదలకు సిఎం సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నారని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఎందరో నిరుపేదలకు ఆర్థికంగా ఆదుకుంటూ ప్రాణాలు కాపాడుతున్నారని పేర్కొ న్నారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, వాల్మీకిపురం చెందిన టిడిపి నాయకులు మల్లికార్జున్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.



బాధితులకు సిఎం సహాయనిధి చెక్కులు అందిస్తున్న కిషోర్‌కుమార్‌రెడ్డి

'ఆకేపాటి'ని కలిసిన తంబళ్లపల్లి నాయకులు



అమర్నాథ్‌రెడ్డిని సన్మానిస్తున్న తంబళ్లపల్లి వైసిపి నాయకులు

ప్రజాశక్తి-బి.కొత్తకోట

రాజంపేట ఎమ్మెల్యే, అన్నమయ్య జిల్లా వైసిపి అధ్యక్షులు ఆకేపాటి అమర్నాథ్‌రెడ్డిని మండ లానికి చెందిన వైసిపి నాయకులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. వైసిపి బిసి సెల్ జిల్లా అధ్యక్షుడు సాంబశివ, తంబళ్లపల్లి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షుడు రెడ్డిహరి, నియోజవర్గం బిసి సెల్ అధ్యక్షుడు రెడ్డి శేఖర్, కురుబలకోట మండలం, ఎర్రబల్లి సర్పంచ్ ఈశ్వర్ ఆకేపాటిని కలిసినవారిలో ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు ఈ పదవులు కేటాయించినందుకు జిల్లా అధ్యక్షులు మర్యాద పూర్వ కంగా కలిసి శాలువా, పూలమాలతో సత్కరించినట్లు తెలిపారు. తమకు ఈ పదవులు రావడానికి కారకులైన మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, మాజీమంత్రి పెద్దిరెడ్డి రామచంద్ర రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 2029లో మళ్లీ వైసిపిని అధికారంలోకి తీసుకొచ్చి జగన్మో హన్ రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రి చేసుకునేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని వారు స్పష్టం చేశారు. ప్రభుత్వ వేదింపులకు తలొగ్గేదేలేదని, పార్టీకి పూర్వవైభవం తీసుక వచ్చేందుకు ఇప్పటి నుంచే పని చేస్తామని అన్నారు.

వైసిపి బలోపేతానికి కృషి చేయాలి : ఎమ్మెల్యే

తంబళ్లపల్లి : వైసిపిని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలు సమిష్టిగా కృషి చేయాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో సమాలోచనలు జరిపారు. అధికార పార్టీ అక్రమాలను, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండ గట్టాలన్నారు. ఇప్పటి నుంచే క్రియాశీలంగా పనిచేయాలని సూచించారు. ప్రభుత్వం అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి బలంగా తీసుకపోవాలని సూచించారు. నిత్యం ప్రజలతో మమేకమై పార్టీ పటిష్టత గట్టి పునాది వేయాలని చెప్పారు. తిరిగి అధికారంలోకి వచ్చే విధంగా పనిచేయాలన్నారు. నూతనంగా పార్టీ పదవులు పొందిన వారు ఎమ్మెల్యేకి పుష్ప గుచ్చాలు ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. తంబళ్లపల్లి మండల కన్వీనర్ ను చౌడేశ్వర్‌ను ఎమ్మెల్యే శాలవాతో సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపిపి కరీం, ఎంపిటిసి మహేష్, నాయకులు నరేంద్ర రెడ్డి, కిషోర్‌రెడ్డి, శివారెడ్డి, డిజె వెంకటరమణారెడ్డి, జైనారాయణరెడ్డి, రామ్మూర్తి, మైనుద్దీన్ పాల్గొన్నారు.



చౌడేశ్వర్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ద్వారకనాథ్‌రెడ్డి

ప్రకృతి వ్యవసాయ పంటలపై అవగాహన

ప్రజాశక్తి - చాపాడు ప్రకృతి వ్యవసాయ పంటలపై ఫార్మర్ సైంటిస్ట్‌లకు అవగాహన కల్పించారు. మండల పరిధిలోని పల్లవోలు గ్రామంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో సాగు చేస్తున్న మెంటర్ రామాంజనేయులు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా 25 రకాల పంటలను పరీక్షించారు. పంటలలో కొన్ని మొక్కలను అబ్జర్వేషన్‌కు తీసుకున్నారు. వీటిలో మొక్క ఎత్తు, ఆకు వెడల్పు, కాయలు, పూలు కౌంట్ చేశారు. మొక్కలు ఉన్న దానికన్నా చాలా ఎత్తు పెరిగాయని, కాయల సైజు కూడా చాలా పెద్దవిగా కనిపించాయన్నారు.

రంగాపురంలో ఘనంగా జ్యోతుల ఉత్సవం

ప్రజాశక్తి - ఖాజీపేట :

మండల పరిధిలోని రంగాపురం గ్రామంలో జ్యోతుల ఉత్సవ కార్యక్రమాన్ని శనివారం గ్రామస్తులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో కొలువై ఉన్న శ్రీచౌడేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి ఘనంగా పూజలు చేశారు. గ్రామంలో పండగ వాతావరణం నెలకొంది. పరిసర గ్రామాల నుండి ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

క్రైం కార్నర్



మృతి చెందిన దర్శత్‌సాయి



బోల్తాపడిన కారు

కుక్కను కాపాడబోయి..కారు బోల్తా

- బాలుడి మృతి : నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-రామాపురం

మండల పరిధిలోని పాలనగారిపల్లి వద్ద రోడ్డుపై ఉన్న కుక్కను తప్పించబోయే కారు బోల్తా పడిన ఘటనలో దర్శత్ సాయి(1) బాలుడు మృతి చెందగా నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు.. గుర్రంకొండకు చెందిన పాలకొండ రాయుడు తన కుటుంబ సభ్యులతో కలిసికారులో పాలకొండలోని పాలకొండరాయుని వద్దకు బయలుదేరారని తెలిపారు. మండల పరిధి లోని పాలన్నగారిపల్లె వద్దకు రాగానే రోడ్డు పైన కుక్క కని పించడంతో కుక్కను తప్పించబోయి డ్రైవర్ కారును ప్రక్కకు తిప్పడంతో కారు అదుపుతప్పి బోల్తా పడిందని అన్నారు. ఈ ఘటనలో దర్శత్ సాయి(1) మృతి చెందగా డ్రైవర్ రాఫి, నాగేష్, మౌనిక, పూజిత అనే మహిళలు గాయపడ్డారు. గాయపడిన వారిని 108లో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు అన్నారు. ఈ ఘటనపై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

హత్యాయత్నం కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి-కలకడ



నిందితుడి అరెస్టును చూపుతున్న పోలీసులు

వ్యక్తి పై హత్యాయత్నానికి పాల్పడిన నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు. స్థానిక పోలీసులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు.. మండలంలోని ఎర్రకోటపల్లి పంచాయతీ గొల్లపల్లికు చెందిన సుధాకర్ ఈనెల 7న మూత్ర విసర్జనకు వెళ్లి వస్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన వేమ నారాయణ తాను తీసుకొచ్చిన పెట్రోల్‌ను సుధాకర్ పై పోసి నిప్పు అంటించినట్లు తెలిపారు. సుధాకర్ కేకలు వేయడంతో చుట్టుపక్కల ఉన్నవారు వచ్చి బాధితుడిని కాపాడి పీలేరు తరలించి, అక్కడ నుండి తిరుపతి రుయా వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం తిరుపతి పట్టణంలోని నారాయణాద్రి వైద్యశాలకు తరలించి వైద్య సేవలు అంది స్తున్నట్లు తెలిపారు. వీరి భూ వివాదం జరుగుతోందని తెలిపారు. క్షతగాత్రుడు సుధాకర్ వాంగ్మూలం ఆధారం మేరకు కేసు నమోదు చేసిన విషయం పాఠకులకు తెలిసిందే. శనివారం నిందితుడైన వేమనారాయణను కోన క్రాస్ వద్ద పట్టుకుని అరెస్టు చేసి వాల్మీకిపురం కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ తెలిపారు. నిందితుడిని పట్టుకున్న వారిలో ఎస్ఐతో పాటు హెడ్ కానిస్టేబుళ్లు హరిబాబు, రమేష్‌బాబు, పోలీసులు కరుణాకర, రమేష్, రియాజ్ బాషా, డ్రైవర్ రమేష్ బాబుఉన్నట్లు తెలిపారు.

పాలవ్యాన్, ఆర్‌టిసి బస్సు ఢీ

- ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం

ప్రజాశక్తి-పీలేరు



ఢిల్లీబాబు, వెంకటేష్ (ఫైల్ ఫొటో)

పీలేరు-కడప జాతీయ రహదారిపై పాలవ్యాన్‌ను ఆర్‌టిసి బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు డ్రైవర్లు దుర్మరణం చెందిన సంఘటన అన్నమయ్య జిల్లాలో చోటుచేసుకుంది. పీలేరు నియోజకవర్గంలోని కెవిపల్లి మండలం, మహల్ క్రాస్ వద్ద శనివారం చోటు చేసుకున్న ఘటనా వివరాలు పోలీసుల కథనం మేరకు ఇలా ఉన్నాయి. పూతలపట్టులోని తేజస్ పాల కేంద్రం నుంచి ఏజెంట్లకు పాల ప్యాకెట్లు సరఫరా చేయడానికి బయలుదేరి వచ్చిన టాటా ఎసి పాల వ్యాన్‌ను మహల్ క్రాస్ వద్ద ఓ మలుపులో రాయచోటి నుంచి చెన్నై వెళుతున్న ఆర్‌టిసి బస్సు మరో వాహనాన్ని ఓవర్ టెక్ చేస్తూ ఎదురుగా వచ్చిన పాల వ్యాన్ ను వేగంగా ఢీకొందని తెలిసింది. ఈ ఘటనలో అన్నమయ్య జిల్లా, రామాపురం మండలం, నీలకంఠరావుపేటకు చెందిన శ్రీరాములు కుమారుడు పి.వెంకటేష్ (22),చిత్తూరు జిల్లా గుడిపాలకు చెందిన డి.ఢిల్లీబాబు(32) అనే ఇద్దరు డ్రైవర్లు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. సమాచారం అందుకున్న కెవి పల్లి పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వి.చిన్న రెడ్డప్ప తెలిపారు. అనంతరం ఇద్దరి మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు పీలేరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి చేరుకుని బోరున విలపించారు. మృతుడు ఢిల్లీ బాబుకు వివాహమై భార్య సంగీత, తొమ్మిదేళ్ల పాప ధనుశ్రీ, ఆరేళ్ల బాబు జశ్వంత్ ఉన్నారు. మరో మృతుడు వెంకటేష్ మెడలోని అత్యంత ఖరీదైన బంగారు గొలుసు, వేలి ఉంగరం, బంగారు చెవిపోగు, జేబులోని పర్సు మాయం అయ్యాయని, మృతుడి జేబులో ఐఫోన్‌తో పాటు మరో ఫోన్ మాత్రమే ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారని మృతుడి బంధువులు చర్చించుకోవడం గమనార్హం.

అనుమానాస్పద స్థితిలో విద్యార్థిని మృతి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్



మృతి చెందిన విద్యార్థిని పూజిత

అనుమానాస్పద స్థితిలో బీఫార్మసీ చదువుతున్న విద్యార్థిని మృతి చెందింది. శనివారం మదనపల్లె మండలం, సిటియం రోడ్డులోని తట్టివారిపల్లి చెరువులో మృతదేహం తేలియాడడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు తాలూకా సిఐ కళా వెంకటరమణ సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వెలికి తీసి వివరాలు సేకరించారు. సిఐ కథనం మేరకు.. పీలేరు పట్టణం సమీపంలోని బాలంవారిపల్లికి చెందిన ఎంటి భాస్కర్ కుమార్తె ఎంటి పూజిత (24) మదనపల్లె మండలం, గంగన్నవారిపల్లె వద్ద ఉన్న కృష్ణ చైతన్య నర్సింగ్ కళాశాలలో బీఫార్మసీ మూడవ సంవత్సరం చదువుతోంది. ఈ విద్యార్థిని మదనపల్లి పట్టణంలోని ప్రశాంత్‌నగర్‌లోని బాలాజీ పీజీ హాస్టల్లో ఉంటూ రోజు కళాశాలకు వెళ్లి వచ్చేది. ఏం జరిగిందో ఏమో కానీ శనివారం చెరువులో మృతదేహమై కనబడింది. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విద్యార్థిని మృతి వెనుక ఎన్నో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఎవరైనా హత్య చేసి పడేశారా లేక ఆత్మహత్య చేసుకుందా అన్నది పోలీసు విచారణలో తేలాల్సి ఉంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

12న మల్లయ్య కొండ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల కేంద్రానికి సమీపంలో మల్లయ్య కొండపై వెలసిన శ్రీ భ్రమరాంబికా సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ఈ నెల 12న ఉదయం 11 గంటలకు హుండీల లెక్కింపు జరుగుతుందని ఇఒ మునిరాజా తెలిపారు. మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను లెక్కించడం జరుగుతుందన్నారు.